పరామర్శ



మందా జగన్నాథంచిత్రపటానికి నివాళి అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

చంపాపేట: తెలంగాణ రాష్ట్ర సాధనలో చట్ట సభల్లో కీలకపాత్ర పోషించిన మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి రాష్ట్రానికే తీరని లోటని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన చంపాపేటలోని మందా జగన్నాథంనివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీఎస్పీతోనే బహుజనులకు రాజ్యాధికారం

నాగోలు: దేశంలో రాజ్యాంగ వ్యతిరేక పాలన సాగుతోందని గతంలో కాంగ్రెస్, ప్రస్తుతం బీజేపీ పాలనలో ప్రజలకు సరైనా న్యాయం జరగడం లేదని బీఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇబ్రాం శేఖర్ ఆరోపించారు. మాయావతి జన్మదినం సందర్భంగా ఎల్‌బీనగర్‌లో ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా బహుజనులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో మాయావతి ముఖ్యమంత్రి అయిన తర్వాత దళిత సమాజం మీద దాడులు తగ్గాయన్నారు. తెలంగాణలో ఉన్న బహుజనులు ఇది గమనించాలన్నారు. బీఎస్పీ గెలిచినప్పుడే బహుజనులకు అధికారం లభించినట్లు బీఎస్పీ అధికారంలో ఉంటే ఎస్సీ, ఎస్టీ, బీసీలు సంపూర్ణ రక్షణతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మేందర్, జగన్, దొడ్డి శ్రీనివాస్, పల్నాటి రాములు, నితిన్ కిశోర్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



ఎల్లయ్య

నాగోలు: పనికోసం బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, కనుముకుల గ్రామానికి చెందిన చుక్క ఎల్లయ్య (60) కుటుంబ సభ్యులతో కలిసి గత కొంతకాలంగా మన్సూరాబాద్ సాయిసప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఆదివారం పని నిమిత్తం బయటకు వెళ్లిన ఎల్లయ్య రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం

అబిడ్స్: కష్టపడి పని చేసే వారికి బీజేపీలో సముచిత స్థానం ఉంటుందని గోషామహల్ నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు ఆల పురుషోత్తం రావు పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖః సంతోషాలతో ఉంటున్నారన్నారు. గోషామహల్ డివిజన్ బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన సోమరాజు సింగును ఆయన సత్కరించి అభినందించారు. అనంతరం పురుషోత్తం రావు మాట్లాడుతూ..నియోజకవర్గంలో బీజేపీ ఎల్లప్పుడూ నెంబర్ వన్ స్థాయిలో ఉంటుందన్నారు. సోమరాజు సింగ్ మాట్లాడుతూ.. గోషామహల్ డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో పరిష్కరించేందుకు నిరంతరం పాటుపడుతున్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

ముగ్గురి అరెస్టు

నాగోలు: ఇంటి తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, మోతే మండలం, నెరదాబాయి, గోపా తండాకు చెందిన కొర్రా రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్ శ్రీనివాసనగర్‌లో కాలనీలో ఉంటూ విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 12న సొంత గ్రామానికి వెళ్లారు. రమేష్ ఇంటి తాళం పగలకొట్టి ఉన్నట్లు గుర్తించిన రెండో అంతస్తులో ఉండే బచలయ్య రమేష్‌కు చెప్పాడు. ఇంటికి వచ్చి పరిశీలించగా అల్మారాలోని 30 గ్రాముల బంగారం నల్లపూసల గొలుసు, 2 సెల్‌ఫోన్లు, 1 ల్యాప్‌టాప్, కొంత నగదు చోరీకి గురైనట్లే గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు కాలనీలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. పాత నేరస్థుడైన అంబర్‌పేట గోల్నాకకు చెందిన పూజారి దేవర సాగర్(23)అంబర్‌పేట, ప్రేమ్‌నగర్‌కు చెందిన పాత నేరస్తురాలు ప్రవళ్లిక(19) అదే ప్రాంతాన్ని చెందిన మహేష్, జగద్గిరిగుట్టకు చెందిన మైనర్ బాలిక(17)ను అదుపులోకి తీసుకుని చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. మహేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



ఆర్‌కేపురంలోని కాలనీలో గంగిరెద్దుల సందడి



మూసారంబాగ్‌లో . .



వేడుకల్లో పాల్గొన్న శ్రీనివాస్‌గౌడ్ కుటుంబ సభ్యులు

సంక్రాంతి సంబరం

దిల్‌సుఖ్‌నగర్: కనుమ, సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హరిలోరంగహరీ..అంటూ హరిదాసు కీర్తనలు..గంగిరెద్దుల విన్యాసాలు, యువతుల కేరింతలతో ముచ్చటగా సాగిన మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాలను మలక్‌పేట్‌జోన్ పరిధిలోని ఘనంగా నిర్వహించారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్‌సదన్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్ది గొబ్బెమ్మలతో అలంకరించారు. యువకులు, పిల్లలు,పెద్దలు గాలిపటాలను ఎగరవేస్తూ సందడి చేశారు. ఆర్‌కేపురం, సరూర్‌నగర్, మలక్‌పేట్, ఓల్డ్‌మలక్‌పేట్, సైదాబాద్, మాదన్నపేట్ తదితర ప్రాంతాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్లలో..

సైదాబాద్: ఐఎస్‌సదన్, సైదాబాద్ డివిజన్ లవాసులు సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళ, బుధవారాల్లో సంక్రాంతి, కనుమ వేడుకలను నిర్వహించుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. యువకులు ఇంటి పరిసరాలలో చెరుకు గడలతో పందిళ్లు వేసి, పూలతో అలంకరించి సందడి చేశారు. సుబ్రహ్మణ్యనగర్‌లో టీపీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు సాంప్రదాయ పద్ధతుల్లో వేడుకలు జరుపుకున్నారు. మైదానాలు, భవంతులపై చిన్నారులు, యువత సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేసి గాలిపటాలు ఎగరవేశారు.

మలక్‌పేట పరిధిలో..

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పరిధిలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మజ్లిస్ పార్టీ యువనేత బి.నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల పాల్గొని గాలిపటం ఎగురవేసి సందడి చేశారు. గడ్డిఅన్నారంలో యూత్ కాంగ్రెస్ నేత ప్రొద్దుటూరి సంఘిరెడ్డి, మూసారంబాగ్ కృష్ణతులసినగర్‌లో స్థానిక నేతలు గౌర విజయ్‌కాంత్, శశిధర్ రావు గాలిపటాలు ఎగరవేశారు.

ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో..

నాగోలు: ఎల్‌బీనగర్‌జోన్ పరిధిలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇళ్ల ముందు వేసిన ముగ్గులు కనువిందు చేశాయి. వివిధ అపార్ట్‌మెంట్‌వాసులు కలిసికట్టుగా పండుగ జరుపుకున్నారు. వివిధ ప్రాంతాల్లో హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలో నిర్వహించిన వృషభ, గోవత్స సహిత గోపూజలో సీహెచ్‌వీఆర్ కే.మూర్తి, పెల్లూరు సత్యనారాయణ మూర్తి, మంగపతిరావు, సిరిపురపు అప్పారావు, రవిశర్మ, సీతారామశర్మ, కృష్ణాదిశేషు, శ్రీరాం పాల్గొన్నారు.



గడ్డిఅన్నారంలో.. యూత్ కాంగ్రెస్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘిరెడ్డి



మలక్‌పేటలో.. పతంగి ఎగురవేస్తున్న ఎమ్మెల్యే బలాల



ఓ ఇంటి ముందు వేసిన అందమైన ముగ్గు



గాలి పటాలను ఎగరవేస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ



గోపూజలో పాల్గొన్న ప్రతినిధులు

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న డీవీ ప్రసాద్‌రావు దంపతులు

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని వివిధ ఆలయాల్లో బుధవారం గోదా రంగనాథ స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. సంతోష్‌నగర్, చంపాపేట శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయాలలో భాజాభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ గోదాదేవి కల్యాణం జరిపించారు. భక్తులు అమ్మవారి కల్యాణం వీక్షించేందుకు ఆలయాని చేరటంతో ఆ ప్రాంతమంతా పండగ వాతావరణం నెలకుంది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ మాజీ పాలకమండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, దేవులపల్లి ప్రసాదరావు, శేఖర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

భర్త వేధింపులకు గృహిణి బలి



సింధుభార్గవి (ఫైల్)

సైదాబాద్: భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ కాలనీకి చెందిన బాలకృష్ణ కుమార్తె పసుపులేటి సింధుభార్గవి (30)కి పూసలబస్తీకి చెందిన పసుపులేటి సంతోష్‌తో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న సంతోష్ ఏడాదిగా వరకు బాగానే ఉండి ఆ తర్వాత మద్యానికి బానిసై భార్యను వేధించేవాడు. పుట్టింటికి వెళ్లిన ఆమెను ఎన్నో సార్లు తల్లిదండ్రులు సముదాయించి తిరిగి పంపించేవారు. ఈ నెల 14న సింధభార్గవి పుట్టింటికి వెళ్లి వేధింపుల గురించి తల్లిదండ్రులకు చెప్పి, భర్త ఇంటికి వెళ్లిపోయి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తన కూతురు మృతికి ఆమె భర్త సంతోష్ కుమార్, అతని స్నేహితులు శ్రీనివాస్, సరితపై అనుమానాలు వ్యక్తం చేస్తూ బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నియామకం

హయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా హయత్‌నగర్ డివిజన్ రంగనాయకుల గుట్టకాలనీకి చెందిన అల్వాల కళ్యాణ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కళ్యాణ్ మాట్లాడుతూ.. ఎల్‌బీనగర్‌లో బలమైన ఓటు బ్యాంకు ఉన్న ఎస్సీలను కాంగ్రెస్ వైపు మళ్లించేందుకు కృషి చేస్తానని, పార్టీని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చూస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం ఆమె వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని వాటి ఏర్పాటు కోసం అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలన్నారు. కార్పొరేటర్ వెంట పలు కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న సుజాతానాయక్

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



శిబిరానికి హాజరైన ప్రజలు

ఎల్‌బీనగర్: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్‌గౌడ్ అన్నారు.బుధవారం సాహెబ్ నగర్ దుర్గాస్థలి శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఓనస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివరాలు సమగ్రంగా సేకరించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

- లబ్ధిదారుల ఎంపికపై అధికారులకు అవగాహన
- నేటి నుంచి 20వరకూ సర్వే

మహేశ్వరం: లబ్ధిదారుల ఎంపికపై అధికారులు సర్వేను సమగ్రంగా చేపట్టాలని మహేశ్వరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ కార్యాలయంలో సంక్షేమపథకాలకు సంబంధించిన వివరాలు, చేపట్టబోయే సర్వేపై గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ....గురువారంనుంచి 20వ తేదీ వరకు రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలకు సంబంధించిన అర్హుల ఎంపిక సర్వేను సమగ్రంగా చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ నెల 21 నుంచి 25 వరకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితా ప్రదర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ నవత, ఎంపీఓ రవీందర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి నాగమణి, ఉపాధి హామీ పథకం ఎపీఓ పరిమళ, సూపరింటిండెంట్ జయశ్రీ, గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల్లో..

నేటి నుంచి 20 వరకు గ్రామాల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే చేపట్టాలని కందుకూరు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లబ్ధిదారుల ఎంపికలో చేపట్టబోయే ఫీల్డ్ సర్వేలో అధికారులు వివరాలను సమగ్రంగా సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సుధారాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్డు సభలు

తుక్కుగూడ: ఇందిరమ్మ ఆత్మీయ భరసా కింద అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక కోసం గురువారం నుంచి మున్సిపాలిటీ వ్యాప్తంగా వార్డు సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బరిగెల హేమలత తెలిపారు. బుధవారం పుర కార్యాలయంలోని సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈ సభల ద్వారా ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ కోసం అర్హులను గుర్తించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి, వైస్ చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, శివకుమార్, పద్మ, విలాస్, రవినాయక్, రాజు, మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు పాల్గొన్నారు.



తుక్కుగూడ: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ హేమలత

బేగంబజార్ చేపల వ్యాపారులకు న్యాయం చేయాలి

అబిడ్స్: బేగంబజార్‌లోని చేపల మార్కెట్ స్టాల్స్‌ను గతంలో మంజూరైన గంగపుత్ర సంఘం సభ్యులైన చేపల వ్యాపారులకు కేటాయించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బేగంబజార్ గంగపుత్ర సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే కౌసర్ ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్ ఇలంబర్తిని కలిశారు. బేగంబజార్‌లో చేపల మార్కెట్ ఏర్పాటు సమయంలో 236 మంది చేపల వ్యాపారులకు స్టాల్స్ కేటాయించాలని అప్పట్లో వినతిపత్రం సమర్పించడం జరిగిందన్నారు. 2016లో ఈ స్టాల్స్ వారికి కేటాయిస్తామని అధికారులు హామీ కూడా ఇచ్చారని ఆయన బల్దియా కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ 236 మంది చేపల వ్యాపారులు వంశపార్యపరంగా నిజాం కాలం నుంచి బేగంబజార్‌లో చేపల వ్యాపారం నిర్వహిస్తున్నారన్నారు. వారికే స్టాల్స్ కేటాయించి న్యాయం చేకూర్చాలని ఈ సందర్భంగా ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. బేగంబజార్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌సింగ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

నిత్య వెలుగులు.. ఆర్పేదెవరు?

వనస్థలిపురం, హస్తినాపురం డివిజన్లలో రాత్రిపూట వెలగాల్సిన వీధి దీపాలు పట్టపగలూ వెలుగుతుండటంతో విలువైన విద్యుత్ వృథా అవుతోంది. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ దీపాలు రాత్రి వెలిగి, ఉదయం ఆరిపోయేలా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.

–వనస్థలిపురం

